క్లుప్తంగా

సంక్షేమ వారధులుగా గృహ సారథులు

ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తూ గృహ సారథులు సంక్షేమ వారధులు కావాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కపిలేశ్వరపురం 1, 2 సచివాలయాల పరిధిలో శుక్రవారం గృహ సారథుల ఎంపిక సమావేశంలో ఎమ్మెల్సీ తోట మాట్లాడారు. గ్రామ ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకుల సమక్షంలో గృహ సారథులను ఎంపిక చేశారు. ఒక్కో సచివాలయానికి 16 మంది వలంటీర్లు ఉండగా వారిలో ఒక్కొక్కరి పరిధిలో 50 గృహాలున్నాయి. ప్రతి 50 గృహాలకు ఇద్దరు చొప్పున రెండు సచివాలయాల పరిధిలో 64 మంది గృహ సారథులను ఎంపిక చేశారు. వారినుద్దేశించి ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్నాయని, వాటి కారణంగా సామాన్య ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కట్టా మురళి పాల్గొన్నారు.

ఆప్కో చైర్మన్‌కు సమస్యలపై వినతి



ఆప్కో చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న చైర్మన్లు

కపిలేశ్వరపురం: ఆప్కో చైర్మన్‌గా శుక్రవారం విజయవాడ ఆప్కో సెంట్రల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన గంజి చిరంజీవిని రామచంద్రపురం డివిజన్ పరిధిలోని అంగర, హసన్‌బాద, ఆదివారపుపేట, అద్దంపల్లి, శివల చేనేత సహకార సంఘాల చైర్మన్లు, మేనేజర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. చేనేత సహకార సంఘాల నిర్వహణ తీరు తెన్నులను వివరించామని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేసినట్టు చైర్మన్లు తెలిపారు. ఆయా సంఘాల చైర్మన్లు గుడిమెట్ల శివరామకృష్ణ, దొంతంశెట్టి సత్యప్రకాష్, శలా పరమేశ్వరావు, వాసా వీర్రాజు, ఉప్పు అర్ధనారీశ్వరీ బులిరాజు ఆయనను కలిశారు.

సారా విక్రయాలను నిరోధించాలి

కాజులూరు: మండల గ్రామాలలో జరుగుతున్న నాటుసారా విక్రయాలను అధికారులు నిరోధించాలని గొల్లపాలెం అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తాడి భువనేశ్వరిదేవి అన్నారు. నాటుసారా, అనధికార మద్యం విక్రయాలకు వ్యతిరేకంగా శుక్రవారం గ్రామంలో అలయన్స్‌క్లబ్ సభ్యులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కాజులూరు మండల గ్రామాలకు ఇటు తాళ్ళరేవు మండలం కోరంగి అభయారణ్యం నుంచి, అటు కరప మండలం యండమూరు నుంచి నాటుసారా సరఫరా జరుగుతోందన్నారు. గతంలో బెల్టు షాపులు నిర్వహించే నిర్వాహకులు ప్రస్తుతం నాటుసారా విక్రయాలు చేస్తున్నారన్నారు. పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. క్లబ్ కార్యదర్శి టీడీ దుర్గారాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి కేఎస్ఆర్ ఆంజనేయులు, కాపు చిన్నా, లొల్ల మనోజ్ పాల్గొన్నారు.

నేడు అచ్యుతాపురంలో ‘గడప గడపకూ’

కపిలేశ్వరపురం: మండలంలోని అచ్యుతాపురంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పర్యటిస్తారని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన పర్యటనలో ప్రభుత్వ శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

విశ్వకర్మ యోజనతో అభ్యున్నతి

మండపేట: విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి పీఎం విశ్వకర్మ కౌశల్ యోజన దోహదపడుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం నేత జేసీ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం మండపేటలో జరిగిన సమావేశంలో సత్యనారాయణ ప్రసంగించారు. సంఘ నాయకులు టేకి శ్రీను, చింతలూరి వీరబ్రహ్మం, కింతాడ కోటేశ్వరావు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయండి

ముమ్మిడివరం: డ్వాక్రా సమైక్య సంఘాలు మరింత బలోపేతం కావడానికి వీఏఓలు బాధ్యతగా పని చేయాలని కోనసీమ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.శివశంకరప్రసాద్ సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో శుక్రవారం కొత్తపేట క్లస్టర్ పరిధి గ్రామ సంఘాల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనిధి ద్వారా సంఘ సభ్యుల జీవనోపాధి కోసం విడుదల చేసిన నిధుల రికవరీ ఆశాజనకంగా ఉండడం లేదని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎల్‌డీఎం పి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి కల్పనా పథకం (పీఎంఈజీపీ), ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకాలను వివరించారు. డీఆర్‌డీఏ అడిషనల్ డైరెక్టర్ జిలానీ, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

కష్టాలను గట్టెక్కించే ఈ - పంట

- ముమ్మరంగా నమోదు ప్రక్రియ
- దీని ఆధారంగానే నష్ట పరిహారం
- రైతుకు ప్రయోజనమంటున్న అధికారులు



ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రాయవరం: ఆరుగాలం కష్టపడుతున్న రైతులకు ప్రభుత్వం చేదోడువాదోడుగా నిలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలకు వచ్చే నష్టాలను అధిగమించేందుకు ఈ-క్రాప్ రైతులకు అండగా నిలుస్తోంది. రైతులకు అన్ని విధాలుగా మేలు చేకూర్చే ఈ-పంట విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తోంది. ప్రస్తుతం వ్యవసాయ శాఖ అధికారులు రబీ ఈ-క్రాప్ నమోదులో నిమగ్నమయ్యారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల్లో ఈ-పంట నమోదు ముమ్మరంగా సాగుతోంది. సాగుభూమి విస్తీర్ణం ఎంత? ఎవరు సాగు చేస్తున్నారు? ఏ పంటలను పండిస్తున్నారనే సమాచారాన్ని విడివిడిగా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. పంట సాగు చేసిన తరువాత ప్రతి రైతూ ఈ-పంట తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఇప్పటి వరకు క్లస్టర్ పరిధిలో 69 శాతం ఈ-పంట నమోదైంది.

చురుగ్గా నమోదు ప్రక్రియ

క్లస్టర్ పరిధిలో ఈ-పంట నమోదు చురుగ్గా సాగుతోంది. సులభ రీతితో నష్టాన్ని అంచనా వేయడానికి, పరిహారాన్ని రైతులకు మాత్రమే అందించేందుకు ఈ-పంట విధానం ఎంతో ఉపకరిస్తోంది. గ్రామాల్లో ఉండే అన్ని పంటలు, భూముల వివరాలను తెలుసుకునేందుకు ఈ-క్రాప్ ఉపయోగ పడుతుందని అధికారులు చెబుతున్నారు. క్లస్టర్ పరిధిలోని ఆరు మండలాల్లో 1,02,191 ఎకరాల్లో వరిసాగును రైతులు చేపడుతున్నారు. ఇతర పంటలు కేవలం నాలుగు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్టు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లో పూర్తిగా కాలువ నీటి మీదే సాగు చేస్తున్నారు. వరితో పాటు అరటి, కొబ్బరి, చెరకు పంటలు సాగవుతున్నాయి.

ప్రయోజనాలివీ..

- మండల విస్తీర్ణం, ఏఏ పంటలు సాగు చేశారో తెలుస్తోంది.
- వర్షాభావం/అధిక వర్షాలు వంటి పరిస్థితుల్లో ఏయే పంటలు నష్టపోయారు. ఎంత విస్తీర్ణంలో, ఎంత మంది రైతులు అనే అంశాలు స్పష్టంగా ఉంటాయి.
- మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేసేటప్పుడు ఎటువంటి సమస్యా లేకుండా పంట సాగు ధ్రువీకరణ పత్రం పొందే వీలుంటుంది.

గత నెల 30వ తేదీ నాటికి ఈ-క్రాప్ నమోదు ఇలా (ఎకరాల్లో)..

మండలం	సాగు విస్తీర్ణం	ఈ-పంట నమోదు
రాయవరం	14,646	10,058
కె.గంగవరం	16,624	11,927
కపిలేశ్వరపురం	16,756	11,902
రామచంద్రపురం	18,587	12,492
మండపేట	16878	9,698
కాజులూరు	18,700	14,253

అధిక ప్రయోజనాలు



భూసార పరీక్ష పంటకు ఏ విధంగా రక్షణ ఇస్తుందో, ఈ-పంట నమోదు వల్ల రైతులకు అన్ని ప్రయోజనాలు ఉన్నాయి. పంట సాగు చేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు మధ్యలో పంట అతివృష్టి, అనావృష్టికి గురైతే నమోదు ఆధారంగానే నష్ట పరిహారం అందుతుంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం మండలం

ప్రతిష్టాత్మకంగా ఈఎండీపీ

మండపేట: పాఠశాలల్లో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (ఈఎండీపీ) ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు ఈఎండీపీ జిల్లా మేనేజర్ చదలవాడ ఉదయకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక అంకసాని మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న ఈఎండీపీ కార్యక్రమాన్ని పరిశీలించారు. విద్యార్థి దశ నుంచే వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడంలో భాగంగా ఆ విధమైన ఆలోచనా ధోరణి, వ్యక్తిత్వ వికాసం, ఆర్థిక అక్షరాస్యతలపై తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వీటిపై విద్యార్థులకు ఇప్పటి వరకు 16 సెషన్లు నిర్వహించామన్నారు. ఈఎండీపీ ప్రాజెక్ట్ ఎక్స్‌పోను మార్చి నెలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. హెచ్ఎం సీహెచ్ స్వాభావళి, రీసోర్స్‌పర్సన్లు ఎం.రామలక్ష్మి, కె.సూర్యప్రకాశరావు, సీఆర్‌పీ పి.శేషారావు పాల్గొన్నారు.

మండల సమావేశం రేపు

రామచంద్రపురం రూరల్: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్. కీర్తి స్పందన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

కళాతపస్వికి అశ్రు నివాళి



విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న రుద్రరాజు, సంఘం నాయకులు (ఫైల్)



విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న ఐఎస్ఎన్, ఆలయ కమిటీ సభ్యులు



ప్రముఖ దర్శకుడు విశ్వనాథ్‌తో మల్లిబాబు



గాడ్ జన్మదిన వేడుకల్లో దర్శకుడు విశ్వనాథ్

మండపేట: ప్రముఖ సినీ దర్శకుడు, కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు పలువురు అశ్రునివాళి ఘటించారు. ఆయన మృతి సినీరంగానికి, కళామతల్లికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయనతో తమకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు. ప్రముఖ సినీ దర్శకులు కె.విశ్వనాథ్‌కు మండపేట బ్రాహ్మణసేవా సంఘం నీరాజనం అర్పించింది. 2017 నవంబర్ 12న బ్రాహ్మణసేవా సంఘం కార్తీక వనసమారాధనకు మండపేట వచ్చిన విశ్వనాథ్‌కు గరగ నృత్యాలు, కోలాట బృందాలతో సంఘ నాయకులు స్వాగతం పలికారు. సంఘ అధ్యక్షుడు పిడపర్తి భీమశంకరశాస్త్రి అధ్యక్షతన జరిగిన సభలో ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చేతుల మీదుగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఎప్పుడు హైదరాబాద్ వెళ్లినా తమను ఎంతో ఆత్మీయంగా పలకరించేవారని సంఘ నాయకుడు శివకోటి శేషసుబ్రహ్మణ్యం గుర్తుచేసుకున్నారు. ఆయన మృతికి సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం, అవసరాల వీర్రాజు, జీఎస్ భగవాన్, కేసరి విద్యాసాగర్, అయ్యగారి విశ్వేశ్వరరావు శుక్రవారం జరిగిన సంతాప సభలో ఘనంగా నివాళులర్పించారు.

ఆ పాదాలు తాకిన క్షణాలు మరువలేము

దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, పద్మశ్రీ కె.విశ్వనాథ్ పాదాలు తాకిన క్షణాలు మరువలేమని మండపేట ఐఎస్‌డీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యినపకోళ్ల సత్యనారాయణ (ఐఎస్ఎన్), శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం పాలక మండలి మాజీ సభ్యులు పేర్కొన్నారు. 2017 నవంబరులో మండపేట వచ్చిన సందర్భంగా స్వామివారి దర్శనానికి విచ్చేసిన విశ్వనాథ్‌ను ఐఎస్ఎన్, అప్పటి ఆలయ కమిటీ చైర్మన్ సంకా శ్రీనివాసరంగా, సభ్యులు ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కళాతపస్వికి ఘనంగా నివాళులర్పించారు.

దర్శక సూర్యుడు విశ్వనాథ్

పాశ్చాత్య ఒరవడిలో కొట్టుకుపోతున్న తెలుగువారిని తమ భాషా, సంస్కృతుల పట్ల గౌరవం కలిగించే చిత్రాలతో మేల్కొలిపిన దర్శక సూర్యుడు కె.విశ్వనాథ్ అని తాపేశ్వరం సురుచిఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు అన్నారు. విశ్వనాథ్ మృతి సినీరంగానికి, తెలుగువారికి తీరని లోటన్నారు. ఆరేళ్ల క్రితం రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో ఆయన్ను తాను కలిశానన్నారు. అంతటి గొప్ప వ్యక్తితో కొద్దిసేపు ముచ్చటించడం ఎంతో మంచి అనుభూతిని కలిగించిందని మల్లిబాబు గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

విశ్వనాథ్‌కు గాడ్‌తో అనుబంధం

రాయవరం: మండలంలోని వెదురుపాకలో గల విజయదుర్గా పీఠాధిపడితో(గాడ్)తో దర్శకుడు విశ్వనాథ్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. 2005లో గాడ్ 71వ జన్మదిన వేడుకల్లో విశ్వనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్వనాథ్‌తో పీఠానికి ఉన్న అనుబంధాన్ని పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, పీఆర్ఓ బాబిలు గుర్తు చేసుకున్నారు.

వివాదాల పరిష్కారానికే శాశ్వత భూరక్ష పథకం



భూరక్ష పత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: గ్రామాల్లో తరతరాలుగా ఉన్న భూ వివాదాలను పూర్తిగా పరిష్కరించేందుకే ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండల పరిధిలోని అముజూరులో శుక్రవారం భూ యజమానులకు జగనన్న భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ నానాపరపు కల్యాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలో లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో సీఎం జగన్ సంస్కరణలు చేపట్టారన్నారు. గతంలో గ్రామీణ ప్రాంత యజమానులు తమ భూములను సర్వే చేయించుకోవాలంటే ఎంతో సమయం వెచ్చించాలని, కానీ ఈ పథకం ద్వారా ఆధునిక సాంకేతికతతో సర్వే చేయిస్తున్నారన్నారు. తహసీల్దార్ వైద్యనాథ శర్మ, ఏఓ బి.రవి వీఆర్‌బీ పట్టాభి రామారావు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, గ్రామ పెద్దలు నానాపరపు శ్రీనివాస్, పెంకే రవిచంద్ర, మేడిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా సదస్యం



సదస్యం నిర్వహిస్తున్న పండితులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామలో వేంచేసియున్న శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం స్వామివారి సదస్యం ప్రత్యేక వేదికపై ఘనంగా నిర్వహించారు. కల్యాణ మూర్తులైన మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమత సూరేశ్వరస్వామివార్లను వేదికపై అధిష్టింపజేసి, ఆలయ అర్చకులు స్వామివార్లకు, అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలను పూశారు. అనంతరం గణపతి పూజ, అష్టదిక్పాలక ఆవాహన, ముక్కోటి దేవతా ఆవాహన చేశారు. వేద స్వస్తి, స్వస్తి ప్రవచనం అనంతరం వేద పండితులు, ఆగమ పండితులు, అర్చకస్వాములు, స్వస్తివాచకులు, పురోహితులను ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి(తారకేశ్వరరావు) నూతన వస్త్రాలు అందజేసి సత్కరించారు. నీరాజన మంత్రపుష్పంతో సదస్యం కార్యక్రమం పూర్తయ్యింది. స్వామివారి సదస్యం వీక్షించిన భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. అనంతరం సర్వ వాహనాలపై కల్యాణమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు.

పేదల ప్రగతే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్సీ తోట
- కాలేరులో గడప గడపకూ మన ప్రభుత్వం



కాలేరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజల ప్రగతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను అందిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని కాలేరులో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు టేకి సత్యమంజు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఏలేటి గంగరాజు గ్రామంలోని పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. సంక్షేమ పథకాల అమలులో తలెత్తిన సాంకేతిక ఇబ్బందులను పలువురు ప్రస్తావించగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్సీ తోటకు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కొమరం సూర్యారావు, సచివాలయ ఉద్యోగులు వివరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు భిన్నంగా అవినీతి, అక్రమాలకు తావులేకుండా నేరుగా అర్హులకు లబ్ధి చేకూరుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయం, వలంటీర్ వ్యవస్థలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. ప్రజల అవసరాలను తెలుసుకునేందుకు, వారి సమస్యలను నిర్దేశించిన సమయంలో పరిష్కరించేందుకు సీఎం జగన్ పాలనా తీరు సమర్థంగా ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఏలేటి గంగరాజు, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ పలివెల పద్మమణి పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



వెంటూరులో స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు మంగతాయారు

రాయవరం: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు పేర్కొన్నారు. వెంటూరు, చెల్లూరు, పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యతోపాటు వైద్యానికి ప్రాధాన్యతను ఇస్తున్నారని అన్నారు. వెంటూరులో జరిగిన కార్యక్రమంలో ఉపసర్పంచ్ నున్న ప్రదీప్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు చిక్కాల శ్రీరాములు, పీఎంసీ చైర్మన్ మేటిశెట్టి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నేతలు పాలిక గోవిందు, వాసంశెట్టి రాధాకృష్ణ, పాఠశాల హెచ్ఎం డి.సత్తిరాజు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలను సందర్శించిన హౌసింగ్ సీఈ



వెలంపాలెం జగనన్న కాలనీలో పర్యటిస్తున్న హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ వీరేశ్వరప్రసాద్

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ జి.వీరేశ్వరప్రసాద్ శుక్రవారం మండలంలోని వెల్ల, వెలంపాలెం గ్రామాల్లోని జగనన్న కాలనీలను సందర్శించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఉగాది నాటికి పూర్తి స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు చేసుకుని గృహప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు. హౌసింగ్ పీడీ సీహెచ్ బాబూరావు, ఈఈ వై. శ్రీనివాస్, డీఈఈలు కె.మల్లికార్జున్, కె.సత్యనారాయణరెడ్డి, ఏఈ జి.రామకృష్ణ, డీఎల్‌డీఓ ఎ.శాంతి, ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ పలివెల నాగరాజు పాల్గొన్నారు.

లబ్ధిదారునికి పింఛను అందజేత



పింఛను సొమ్మును అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి, కోటేశ్వరరావు

రాయవరం: మండలంలోని వి.సావారం గ్రామంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాలిక కొండపర్తి స్రవంతికి రూ. 10 వేలు పింఛను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో స్రవంతికి మంజూరైన పింఛను సొమ్మును గ్రామ ఉపసర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నేత కాకి కోటేశ్వరరావుల చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. లబ్ధిదారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ కుటుంబం రుణపడి ఉంటుందని అన్నారు. వార్డు సభ్యుడు బి.జాన్సన్, వెల్ఫేర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, స్థానిక నేతలు మండ హరినాథరెడ్డి, గుడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు మెగా ఉచిత వైద్య శిబిరం

మండపేట: స్థానిక బస్టాండ్ వెనుక బీఎస్ఎన్ఎల్ ఆఫీసు పక్కన గల శ్రీసాయి ఆర్థో, ట్రామాకేర్ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు ఆస్పత్రి అధినేత డాక్టర్ రాము తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ప్రారంభిస్తారన్నారు. బీపీ, సుగర్, గుండె, ఎముకలు, గైనిక్ తదితర వ్యాధులకు సంబంధించి వైద్యనిపుణులు రోగులకు సేవలు అందిస్తారన్నారు.

8న మండల సమావేశం

కె.గంగవరం: ఈ నెల 8వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా గల ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు పూర్తి నివేదికతో తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినీమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ హాజరు అవుతారని ఆయన పేర్కొన్నారు.

వాస్తవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి

అమలాపురం రూరల్: జర్నలిస్టులు వాస్తవ వార్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ), విజయవాడ ఆధ్వర్యంలో ఈదరపల్లి సత్కార్ హోటల్‌లో శుక్రవారం పాత్రికేయులకు ‘వార్తాలాప్’ వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా, గ్రామీణ స్థాయిల్లో పనిచేస్తున్న పాత్రికేయులు ప్రజల్లో సానుకూల దృక్పథం కలిగించే వార్తలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ జీడీ హళ్లీకేరి మాట్లాడుతూ ఈ తరగతుల ద్వారా పాత్రికేయులకు వృత్తి నైపుణ్యం పెరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఐసీడీఎస్ పీడీ సత్యవేణి, డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్, ఏపీడీ జిలానీ, డీఐపీఆర్ఓ లక్ష్మీనారాయణ రెడ్డి, పీఐబీ మీడియా అండ్ కమ్యూనికేషన్ అధికారి టి.హెన్రీరాజ్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఉభయ గోదావరి జిల్లాల అధికారి శ్రీరామమూర్తి కందాళ పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేయాలి

అమలాపురం రూరల్: జిల్లా విద్యాశాఖ అధికారులతో సహా ఎంఈఓలు, సెక్టోరియల్ అధికారులు పాఠశాలల్లో తరచూ తనిఖీ చేయాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ డి.మధుసూదన్‌రావు అన్నారు. సమనసలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం జిల్లాలోని ఎంఈవోలు, హెచ్ఎంలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనికి జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ అధ్యక్షత వహించారు. తనిఖీల సమయంలో సిలబస్ సకాలంలో పూర్తి చేస్తున్నారా లేదా అనేది పరిశీలించాలని మధుసూదన్‌రావు అన్నారు.